# వందే! వాసుదేవం

ఆరోజు ఆదివారం. మైత్రి టీవిలో సినిమా చూస్తోంది. తన ఫ్రెండ్ ఉష, భర్తతో సహా ఊడి పడింది.

"కాకినాడ నుండి ఎప్పుడు వచ్చావే" అంటూ ఆప్యాయతగా దగ్గరికి తీసుకుంది మైత్రి.

"కాకినాడ నుంచి ఎప్పుడు వచ్చానో చెపితే నువ్వు కారుకూతలు కూస్తావు! ముందు కొంచెం మంచినీళ్ళు పట్టుకురా చెపుతాను" అంది ఉష. "ప్రతీదీ గుంభనే నీకు! చిన్నప్పట్నుంచి అంతే నువ్వు!" అంది మైత్రి.

"చూడు! ముందు మా ఆయన్ని కూడా కొంచెం మంచినీళ్ళు తాగనీ, ఆయన అసలే అమాయకుడు. నీ ధాటికి తట్టుకోవాలి కదా! ఎందుకైనా మంచిది. ఒక చెంబుతో మంచినీళ్ళు తెచ్చిపెట్టు. అవసరమైతే తాగుతుంటాం"అంది ఉష.

"సరే ఇక మొదలు పెట్టు నీ కథ" అంది మైత్రి.

"కాకినాడ నుంచి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాం. ఆరునెలల క్రితమే ఇక్కడికి వచ్చేశాం. కానీ ఇల్లు కట్టించడంలో పడి నిన్ను కలవలేకపోయాం" అంది ఉష.

"మరి కనీసం ఫోన్ చెయ్యకపోయావా!"

"ఉండవే బాబూ! ఆ పాయింటుకి వస్తున్నా. ఫోన్ చేస్తే ఈ నెంబర్ మారినది అని మెసేజ్ వినపడేది. మళ్ళీ ఇల్లు కట్టించడం హడావుడి" అంది ఉష.

"సర్లే! నీతో అనవసరం! ఏమిటా శుభలేఖలు, గృహప్రవేశానివా! ఇచ్చెయి. మళ్ళీ మరచిపోయి వెళ్ళిపోతావేమో" అని ఓ శుభలేఖ లాక్కుంది మైత్రి.

"ఉండవే పేరు రాసి ఇస్తాను."

"పేరు కూడా మరచిపోయుంటావు" అంది మైత్రి.

"తల్లీ! పేర్లు జ్ఞాపకం ఉన్నాయి. పెళ్ళి ముందు మైత్రివి. పెళ్ళి తర్వాత మైత్రీవాసుదేవ్. అన్నీ జ్ఞాపకం ఉన్నాయి. చిన్నప్పట్నుంచీ ఇంతే నువ్వు. చిన్న తేడా వస్తే చాలు ఇదే వరస నువ్వు!" అంది ఉష.

"నువ్వూ మీ ఆయన ఉండండి. మా ఆయన కూడా వచ్చేస్తారు. ఈ రాత్రి సరదాగా నలుగురూ భోజనం చేద్దాం" అంది మైత్రి.

"ఇంకా చాలా పిలుపులు ఉన్నాయి. గృహప్రవేశం ముందు రోజే వచ్చెయ్యి, మీ ఆయన్ని తీసుకుని, నీవు గోమాతలాంటిదానవు. గృహప్రవేశానికి గోవు ఎంత ముఖ్యమో చెప్పక్కర్లేదు కదా!" అంది ఉష.

"నీకు ఇల్లు కట్టెయ్యగానే కళ్ళు నెత్తిమీదకి వచ్చేశాయి. నన్ను పశువుతో పోలుస్తున్నావు" అంది మైత్రి.

"మేమంతే చిన్నప్పట్నుంచీ! మీరేమీ అనుకోకండి" అంది ఉష భర్త వైపు తిరిగి.

"అనుకొని ఏం లాభం! ఎప్పట్నుంచో అయిన అలవాటుకి" అన్నాడు నవ్వుతూ, ఉష భర్త.

"మీ ఆయన కూడా చతురుడే" అన్నది మైత్రి.

"ఆ కాకపోతే మరి. మీ ఆయన్ని తప్పకుండా గృహప్రవేశానికి రమ్మని తన మాటగా చెప్పమని, చెప్పకుండా బయల్దేరుతున్నారంటే మరి చతురులు కారని ఎలా చెప్పగలం!" అంది ఉష.

"సారీ అండి. నా పిలుపుగా మీ ఆయనకి చెప్పండి. ఎలాగూ ఆయనతో ఫోన్లో చెపుదామని ఇప్పుడు చెప్పలేదు. ఏమనుకోకండి!" అన్నాడు ఉష భర్త.

వాసుదేవ్ ఇంటికి వచ్చేసరికి రాత్రి చాలా లేటయింది.

వస్తూనే టేబుల్ మీదున్న శుభలేఖ చూసి"ఎవరిదీ!" అని అడిగాడు మైత్రిని.

అన్ని వివరాలు చెప్పి "కనీసం ఒక వెయ్యి రూపాయలు పెట్టి మంచి ప్రెజెంట్ ఇవ్వాలి" అంది మైత్రి.

ఆ రాత్రి వాసుదేవ్‌కి నిద్రపట్టలేదు. మైత్రి ఎన్నోసార్లు చెప్పింది 'మనం కూడా ఒక ఇల్లు కడదామని, కనీసం ఒక చిన్న అపార్ట్‌మెంటైనా కొందామని!"

కానీ, వాసుదేవ్‌కి భయం. కనీసం అయిదు లక్షల్లేకుండా ఒక మోస్తరు అపార్ట్‌మెంట్ రాదు. అంత డబ్బు ఖర్చు పెట్టి అప్పుల్లో పడిపోతే మళ్ళీ బయట పడలేమేమో అని. మైత్రి కోరిక తీర్చాలనే ఉంది.

అర్ధాంగి కోరిక తీర్చాలని ఏ మగాడికుండదూ!

పొద్దున్న కాఫీ తాగేటప్పుడు మైత్రి మెల్లిగా మొదలుపెట్టింది.

"చూడండి మా ఉష, మొన్న ఆర్నెల్లక్రితమే హైదరాబాద్ వచ్చి అప్పుడే ఇల్లు కట్టించేసింది తన భర్త చేత."

"ఉష భర్తా ఇల్లు కట్టిందీ! నేను తాపీమేస్త్రి కట్టాడేమో అనుకున్నాను" అన్నాడు వాసుదేవ్, కొంచెం సీరియస్‌నెస్ తగ్గించడానికి.

"సమయం సందర్భం లేకుండా జోక్స్ వేయకండి!" అంది మైత్రి.

"సారీ! చెప్పు! అన్నాడు వాసుదేవ్.

"మొన్న పుట్టింటికి వెళ్ళినప్పుడు మా అమ్మకూడా చెప్పింది, ఇల్లు కట్టుకుంటే కనీసం ఏభైవేలు సాయం చేస్తామని. మీరు ఎలాగైనా ఒక ఇల్లు, మనం శాశ్వతంగా ఉండేందుకు ఏర్పాటు చేయండి" అన్నది మైత్రి.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. మొన్న మా ఫ్రెండ్ ఒకతను అమెరికా వెళ్ళిపోయాడని చెప్పాను జ్ఞాపకం ఉందా! అతని ఎడ్రస్ కూడా సంపాదించాను.

అతన్ని కొంచెం సహాయం చేయమని అడుగుతాను. ఎలా అయినా నీ కోరిక తీరుస్తాను." అన్నాడు వాసుదేవ్.

"ఫర్వాలేదు. ఒకసారి ఆయన మనస్సులో ఏదైనా పడితే, ఆపని అయిపోతుంది!" అని మైత్రి మనస్సు కొంచెం స్థిమితపడింది.

రెండు రోజుల తరువాత, ఊర్నుంచి వాసుదేవ్ బాబయ్యగారు హైదరాబాద్ వచ్చి ఏదో లాడ్జిలో దిగి, అక్కడికి రమ్మని వాసుదేవ్‌కి ఫోన్ చేశారు.

"ఆయన మన ఇంటికి రాకుండా వెళ్ళిపోవడమేమిటి? సాయంకాలం నేనూ వస్తాను. మన ఇంటికి ఆయన్ని తీసుకువద్దాం! అంది మైత్రి.

"ఆయన పెద్ద పండితుడు, జ్యోతిష్యంలో దిట్ట. ఒకవేళ ఆయనకు రావడం కుదరదేమో, ఎందుకైనా మంచిది. మన జాతకాలు పట్టుకురా. ఒకసారి ఆయనకు చూపిద్దాం. జాతకంలో గృహయోగం ఉందో లేదో కనుక్కుందాం" అన్నాడు వాసుదేవ్.

సాయంకాలం లాడ్జికి వెళ్ళారు. ఈసారి వచ్చినప్పుడు తప్పక ఇంటికి వస్తానన్నారు ఆయన.

జాతకాలు చూసి ఒక ఏడాది లోపులో ఇల్లు కడతారనీ, తను దగ్గర ఉండి గృహప్రవేశం చేయిస్తానని చాలా ఉత్సాహంగా, నవ్వుతూ చెప్పారాయన.

మైత్రి ఏనుగెక్కినంత సంబరపడింది.

తర్వాత వాసుదేవ్, తన అమెరికా మిత్రుడ్ని ఇంటి విషయంలో సహాయం చేయమని అడిగాడు.

అతను తన స్థలం రెండు వందల గజాలున్నది ఒకటి ఉందని ఆ వివరాలు అన్నీ ఇస్తూ వాసుదేవ్‌కి నచ్చితే, అది తీసుకుని ఇల్లు కట్టుకోమన్నాడు.

ఆ విషయం విని, ఆశ్చర్యపోయిన మైత్రి, "ఈరోజుల్లో కూడా ఇటువంటి మిత్రులున్నారంటే నమ్మలేకపోతున్నానండి." అంది.

వాసుదేవ్ ఇదే మంచి సమయమని ఒక జోక్ యధాశక్తి పేల్చాడు.

"నువ్వు పులుసులో గరిటిలాంటి దానివి. గరిట అస్తమానూ పులుసులోనే ఉంటుంది, కాని దాని రుచి మాత్రం తెలుసుకోలేదు. నీ పేరు మాత్రం మైత్రేగాని నీకు స్నేహం యొక్క గొప్పతనం తెలియదు".

"సర్లెండి పెద్ద గొప్పే!" అంది మైత్రి.

"రేపు ఆదివారం వెళ్ళి ఆ స్థలం ఒకసారి చూసొద్దాం" అన్నాడు వాసుదేవ్.

ఉష గృహప్రవేశానికి వెళ్ళినప్పుడు, మైత్రి అంది ఉషతో,

"ఉషా! నువ్వుకూడా తొందర్లో గోమాత అవుతావు"

"అర్థమయింది నేను మొన్నే విన్నాన్లే, మీరు శంకుస్థాపన చేశారని. నేను పశువునైనా ఫర్వాలేదు, మీరు ఇల్లు కట్టుకోవడమే కావాలి నాకు" అంది ఉష ప్రేమగా.

కొంతకాలానికి మైత్రి చిరకాలపు కోరిక నెరవేరింది.

గృహప్రవేశానికి చాలామంది వచ్చారు. ప్రత్యేకంగా వాసుదేవ్ అమెరికా మిత్రుడు కూడా వచ్చాడు.

గృహప్రవేశం చాలా బాగా జరిగింది. జాతకం చెప్పిన వాసుదేవ్ బాబయ్య గారు కూడా వచ్చి దంపతులను ఆశీర్వదించారు.

గృహప్రవేశం అయిన మర్నాడు, మైత్రి, వాసుదేవ్ బాబయ్యగార్ని అడిగింది.

“మాకు ఇంకొక ఇల్లు యోగం ఏదైనా ఉందా!” అని.

ఆయన నవ్వుకున్నారు, మనిషికి సంతృప్తి ఉండదని.

“ఏమిటీ బాబయ్యా! నవ్వుతున్నావు” అంటూ వాసుదేవ్ వచ్చాడు.

“అబ్బాయి నీకో చిన్న రహస్యం చెపుతాను విను. మనిషికి ఆత్మవిశ్వాసం ఉండాలేకాని ఏ పనైనా సాధించగలడు. ఆత్మవిశ్వాసంతోపాటు పట్టుదల, పట్టుదలతో పాటు అదృష్టం, అన్నింటినీ మించి, భగవంతుని దయా ఉంటే ఎన్ని ఇళ్ళయినా కట్టవచ్చు. ఇప్పుడు చెపుతున్నాను, అసలు నీ జాతకంలో వివరాలు పూర్తిగా లేవు. ఆ విషయం ముందే చెపితే, ఈ రోజు మనం ఇలా గృహప్రవేశం సందర్భంగా కలపలేకపోదుం. అదీగాక జాతకాలు కూడా పుట్టిన టైమ్ సరిగ్గా తెలిస్తేనే, పండితులు చెప్పేవి యదార్థమవుతాయి. అలాగని ప్రతీ దానికి జాతకం, అని కాలయాపన చేయడం మంచిది కాదు.” అని మైత్రికేసి తిరిగి “అమ్మాయి విన్నావు కదా! దీన్నిబట్టి ఎన్నిళ్ళయినా కట్టవచ్చని తెలుసుకో” అన్నారు.

దంపతులు ఆయన కాళ్లకి ఇంకోసారి దండం పెట్టారు కృతజ్ఞతా పూర్వకంగా, మనసులో ఆయన విజ్ఞతను మెచ్చుకుంటూ.

ఓ ఆర్నెల్ల తర్వాత, వాసుదేవ్ మైత్రితో అన్నాడు.

“మనం మేడ వేసేటప్పుడు చుట్టూ పిల్లర్స్ వేసి కడితే, పైన ఏరియా ఎక్కువ వస్తుంది కదూ! ఎలాగైనా మనం తొందర్లో మేడ కూడా కట్టేద్దాం”.

ఆ మాటలు విన్న మైత్రి, సంతోషంతో “వందే వాసుదేవం” అంది.

(ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక, మార్చి 2004)